# మన బలగం

సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

22-03-2025 శనివారం పేజీలు 4 www.manabalagam.com




## అవినీతిని ప్రశ్నించినందుకు దాడులా?

**ప్రజపాలనలో ప్రశ్నిస్తే నేరమా కార్యకర్తలు, నాయకులపై కేసులు ఎంతవరకు సమంజసం**

*రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (మన బలగం):* రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ లో మానకొండూర్ మాజీ శాసన సభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగన్న, కరీంనగర్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణ మాజీ ప్రతినిధులతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా 3 లో



..3 లో

## పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

## ఒకే దేశం.. ఒకే ఎన్నికపై కార్యశాల

..3 లో





# ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలుపై దృష్టి సారించాలి

**రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్**

- మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు, ఓపెన్ స్పేస్ ఫీజు చెల్లిస్తే 25% రాయితీ
- ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలి
- 100% ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రోసిడింగ్స్ జారీకి చర్యలు తీసుకోవాలి
- ఎల్ఆర్ఎస్పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ

*రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (మన బలగం):* ఎల్.ఆర్.ఎస్ ఆమోదించిన దరఖాస్తులకు సంబంధించిన లబ్దిదారుల నుంచి ఫీజు వసూలుపై అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ ఎల్ఆర్ఎస్ పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్ పై సమీక్షిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ మాట్లాడుతూ, ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించిన అభ్యర్థులకు క్రమబద్ధీకరణ మంజూరు పత్రాలు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా వస్తున్న నూతన లేఔట్ క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హత గల దరఖాస్తుల క్రమబద్ధీకరణ చేపట్టాలని అన్నారు. రాబోయే వారం రోజులలో జిల్లాల్లో 100% ఎల్.ఆర్.ఎస్ క్రమబద్ధీకరణ ప్రోసిడింగ్స్ జారీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టణాలు, నగరాల్లో ఎల్ఆర్ఎస్ చెల్లింపులు, మార్చి 31లోపు కడితే వచ్చే 25% రాయితీపై ప్రజలకు వివరించేలా ప్రచారం కల్పించాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ 2020 క్రమబద్ధీకరణకు సంబంధించి మిగతా 2 లో

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి



**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**ఓటరు జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**

..2 లో

# ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం

## డిఎస్పీ రఘు చందర్ గారు



బుగ్గారం/ మార్చి 21 (మన బలగం) మండలంలోని యశ్వంతరావుపేట గ్రామంలో గల MAJID–E–QUBA నందు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మరియు ఇఫ్తార్ విందుకు జగిత్యాల డిఎస్పి D. రఘు చందర్ గారు, ధర్మపురి సిఐ గారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ గారు మాట్లాడుతూ గౌరవ SP శ్రీ అశోక్ కుమార్ IPS గారి సూచనల మేరకు ప్రతి ప్రార్థన స్థలంలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని, సీసీ కెమెరాల ఏర్పాటు ప్రతి ఒక్కరి బాధ్యత అని, దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు డిఎస్పీ గారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి CI A. రాం నరసింహా రెడ్డి, బుగ్గారం SI M . శ్రీధర్ రెడ్డి, VPO PC పరమేశ్వర్, మసీద్ కమిటీ సభ్యులు,ఖాదర్, బురాన్, ఇమామ్, సమీద్, రహీం, మహేష్, రాజు, శ్రీధర్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేలా చూడండి

## జగిత్యాల జిల్లా డీఆర్డీఏ రఘువరన్



ఇబ్రహీంపట్నం, మార్చి 21 (మన బలగం):ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క దరఖాస్తు దారున్ని కలిసి ఫీజు చెల్లించేలా చూడాలని జగిత్యాల జిల్లా డీఆర్డీఏ రఘువరన్ అధికారులను సూచించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో 110 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా ఆరుగురు మాత్రమే ఫీజు కట్టారని, అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారని అవగాహన కల్పించి ఫీజు చెల్లించేలా చూడాలన్నారు. ఇంటి పన్ను వసూలు ఎందుకు వెనుక పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి ఇంటిపన్ను కోసం టీమ్‌లను ఏర్పాటు చేసుకుని ఇంటికి వెళ్లి పన్ను వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

# ఇన్ స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్ మెంట్ ఆధ్వర్యంలో పోషన్ మేళా

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (మన బలగం): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా, ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోషన్ మేళా ప్రోగ్రాం నిర్వహించారు. సూక్ష్మ పోషకాలలో భాగం అయిన అయోడిన్ లోపం ద్వారా యుక్తవయస్సు మహిళల్లో థైరాయిడ్, గాయిటర్ వంటి రుగ్మతలు వస్తాయని, పిల్లల్లో మందబుద్ధి, శారీరక ఎదుగుదల లోపిస్తుందని, అందువలన అయోడిన్ ఉన్న ఆహార పదార్థాలు, పాలు, పాలపదార్థాలు, అయోడైజ్డ్ ఉప్పు, చేపలు, రొయ్యలు, మరియు కూరగాయలు, నాణ్యమైన పౌష్టిక ఆహారం తీసుకోవాలని వివరించారు. అనంతరం అయోడిన్, పోషకాహారం పైన ఆటల పోటీలు, క్విజ్ నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు, మహిళలకు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ రాజశేఖర్, మండల కోఆర్డినేటర్లు రమ్య, బాబు, తిరుపతి, లక్ష్మణ్, సంగీత, గ్రామ ప్రజలు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకార్థలు, మహిళా సంఘాల సభ్యులు, మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలుపై దృష్టి సారించాలి

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించి అర్హత గల వారికి ఫీజు చెల్లింపు నోటీసులు జారీ చేయాలని, క్షేత్రస్థాయి పరిశీలన ఇరిగేషన్ నుంచి ఎన్.ఓ.సి జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. లేఔట్ క్రమబద్ధీకరణ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నవారు పూర్తి ఫీజుతో పాటు ప్రో– రాటా ఓపెన్ స్పెస్ చార్జిలను మార్చి 31 లోపు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందని అన్నారు. నిషేధిత జాబితాలో లేని, బఫర్, ఎఫ్.టి.ఎల్, చెరువులు కుంటలు తదితర ప్రాంతాలలో లేని ప్లాట్లకు ఆటోమేటిక్ గా ఎల్ఆర్ఎస్ కు అనుమతి లభిస్తుందని చెప్పారు. చెరువులు నీటి వనరులు తదితర ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు మాత్రం రెవెన్యూ నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరిగా చేయాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులు 90% రిఫండ్ అవుతుందని, 10 శాతం ప్రాసెసింగ్ కోసం తీసుకుంటామని అన్నా రు. స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించిన వారికి అర్హత ఉంటే స్థల క్రమబద్ధీకరణ చేసి సంబంధిత ప్రొసీడింగ్స్ జారీ చేయాలని అన్నారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమ బద్ధీకరణ చేసుకోవాలని, మార్చి 31 వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25% రాయితీ పొందాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేకంగా వాట్స్ అప్ గ్రూపులు తయారు చేసి ప్రతి దరఖాస్తుదారులను ఫాలో అప్ చేస్తూ నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించేలా చూడాలని అన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, మున్సిపల్ కమిషనర్లు, సమ్మయ్య అన్వేష్ డిటిసిపిఓ అన్సర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (మన బలగం): జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఓటర్ జాబితా సవరణపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ జాబితా సవరణ పకడ్బందీగా జరగాలని, ప్రజాస్వామ్య విలువలు నెలకొల్పేందుకు ఓటర్ జాబితా చాలా కీలకమని, సరైన ఓటర్ జాబితాతో ఎన్నికల నిర్వహిస్తే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అన్నారు. ఓటర్ జాబితా, పారదర్శకమైన పోలింగ్ సిబ్బంది, ఈవీఎం యంత్రాలు, బ్యాలెట్ ఎన్నికల వ్యవస్థకు కీలకమని కలెక్టర్ అన్నారు. ఎన్నికల సమయంలో కాకుండా ఓటర్ జాబితా సవరణపై రాజకీయ నాయకుల ప్రతినిధులు ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ జాబితా నుంచి పేర్లు తొలగించే సమయంలో తప్పనిసరిగా నిర్దేశిత మార్గదర్శకాలు పాటించాలని అన్నారు. ఓటరు జాబితాలో డబల్ ఎంట్రీల తొలగింపుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. మన జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కొంతమందికి ఓట్లు ఉన్నట్లు వస్తున్న ఫిర్యాదులను జాతీయ ఓటర్ సర్వీస్ పోర్టల్ వివరాలు పరిశీలిస్తూ పరిష్కరిస్తామని అన్నారు. ప్రతి సంవత్సరం 4 సార్లు ఓటర్ జాబితా సవరణ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజాప్రతినిధుల చట్టం 1950 సెక్షన్ 31 ప్రకారం ఓటర్ నమోదు సమయంలో తప్పుడు సమాచారం అందిస్తే నేరమని, మోసపూరిత ఉద్దేశాలతో రెండు చోట్ల ఓటు హక్కు కల్గి ఉండే ఓటర్ల వివరాలు ఆదారాలతో అందిస్తే తప్పనిసరిగా విచారించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. మన రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటి పరిధిలో ఇప్పటివరకు 2 లక్షల 30 వేల 157 మంది పురుష ఓటర్లు, 2 లక్షల 47 వేల 977 మంది మహిళా ఓటర్లు, 38 మంది ఇతరులు మొత్తం 4 లక్షల 77 వేల 182 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. గత అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు వ్యయ వివరాలు నిర్దిష్ట సమయంలో నమోదు చేయాలని, లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోతారని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని కోరారు. ఓటర్ జాబితా సవరణపై ఎటువంటి సందేహాలు, ఫిర్యాదులు, సూచనలు ఉన్నా తెలియజేయాలని అన్నారు.ఈ సమావేశంలో సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు రాధాబాయి రాజేశ్వర్ భాజాపా పార్టి ప్రతినిధి నాగుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సంపత్, భారస పార్టీ ప్రతినిధి రాజన్న, బి.ఎస్.పి పార్టీ ప్రతినిధి రమేష్, సి.పి.ఐ(ఎం) పార్టీ ప్రతినిధి రమణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బంది రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

### నిర్ణీత సమయంలో వస్త్ర ఉత్పత్తులు పూర్తి చేయాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (మన బలగం): సిరిసిల్ల జిల్లా చేనేత వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం కేటాయించిన ఆర్డర్లను నిర్ణీత సమయంలో వస్త్ర ఉత్పత్తులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆర్డర్ల పురోగతిపై సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, సమగ్ర శిక్ష శాఖ, సంక్షేమ శాఖలకు సంబంధించి ప్రభుత్వం వస్త్ర పరిశ్రమకు అందించిన ఆర్డర్ల వస్త్ర ఉత్పత్తిని నిర్ణీత సమయంలో పూర్తిచేసి సప్లై చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళా సంఘాలకు ఒక్కొక్కరికి రెండు చీరలు చొప్పున పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించి సంబంధిత ఆర్డర్‌ను సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కేటాయించిందన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద చీరల పంపిణీ కోసం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు వచ్చిన ఆర్డర్ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత సమయంలో గడువులోగా ఉత్పత్తి చేసి సప్లై చేయాలని అన్నారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ అధికారి రాఘవరావు, టెస్కో ప్రతినిధి శంకరయ్య, వస్త్ర పరిశ్రమ వ్యాపారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (మన బలగం): రాజన్న సిరిసిల్ల జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష హాలును సందర్శించారు. పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను సూచనలు చేశారు.

### కారుణ్య నియామక పత్రాలు అందజేత

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (మన బలగం): సిరిసిల్ల మున్సిపాలిటీలో ప్రజారోగ్య విభాగంలో పని చేసి మరణించిన వారి వారసులకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కారుణ్య నియామకపత్రాలు అందజేశారు. ప్రజారోగ్య విభాగంలో పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా విధులు నిర్వర్తించిన సిరిగిరి నర్సింహులు అనే ఉద్యోగి అనారోగ్య కారణాలతో 2020 సంవత్సరంలో మరణించగా, వారి కుమారుడు సిరిగిరి రాజుకు ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. అలాగే అదే విభాగంలో పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా విధులు నిర్వర్తించిన నగునూరి నాంపల్లి అనారోగ్య కారణాలతో 2023 సంవత్సరంలో మరణించగా అతని భార్య నగునూరి లతకు ఉద్యోగ నియామకపత్రం కలెక్టర్ అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండగా, ఈరోజు నియామకపత్రాలను అందజేసినందుకు జిల్లా కలెక్టర్కు ధన్యవాదాలు తెలిపారు.

# సోన్ సిఐకి సన్మానం

నిర్మల్, మార్చి 21 (మన బలగం): సోన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చిన గోవర్ధన్ రెడ్డిని నిర్మల్ జిల్లా ట్రాస్మా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సోన్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడడంలో విజయవంతం కావాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని కోరుకున్నారు. కార్యక్రమంలో సోన్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేకర్ ప్రసాద్ పాల్గొన్నారు .



# ఒకే దేశం.. ఒకే ఎన్నికపై కార్యశాల

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (మన బలగం): ఒకే దేశం ఒకే ఎన్నికపై శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మాలోత్ లకృతి నాయక్ ఆధ్వర్యంలో కార్యాశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజన్న సిరిసిల్ల మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే దేశం.. ఒకే ఎన్నిక ద్వారా భారతదేశంలో ఎన్నికల వ్యయాన్ని తగ్గిస్తుందని, అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తోందని పరిపాలన స్థిరత్వం పాలసీల అమలుకు అంతరాయం ఉండదని తెలిపారు. ఆర్థిక వృద్ధి ఓటింగ్ శాతం పెంచుకోవడం ఆర్థిక నిర్మాణమైన సంస్కరణలు ఎన్నికల ఖర్చులో అవినీతిని తగ్గిస్తుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక ద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని, బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అవగాహన నిర్వహించాలని సూచించారు. పెద్ద ఎత్తున మహిళలు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, వన్ నేషన్.. వన్ ఎలక్షన్ ప్రోగ్రాం వీర్నపల్లి మండల్ ఇన్చార్జి, భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, జిల్లా సెక్రెటరీ దుంపెన స్రవంతి, ముస్తాబాద్ మండల అధ్యక్షురాలు మహేశ్వరి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ, వేములవాడ టౌన్ అధ్యక్షురాలు వెల్ది రాధిక, సిరిసిల్ల టౌన్ మహిళా కార్యకర్త కర్నే హరీష, ఉపాధ్యక్షులు మాడుగుల లింబద్రి, బట్టు పిరియా, బండారి మహేశ్, మాలత్ ప్రకాష్, బానోత్ శ్రీనివాస్, తిరుపతి, అజ్మీర తిరుపతి, బోడ వెంకటేశ్, కేలత్ రమేష్, బానోత్ పెద్దరాజు, సుమన్, మాడుగుల లక్ష్మి రాజం, మామిండ్ల మోహన్, తదితరులు జిల్లా నాయకులు మండల నాయకులు వివిధ మోర్చా అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన విశ్వకర్మలు



బుగ్గారం, మార్చి 21 (మన బలగం): మండలంలోని గోపులాపూర్ గ్రామంలో ఈ నెల 17వ తారీఖున సోమవారం విశ్వకర్మ ముద్దుబిడ్డ అయినా తోరేటి విష్ణువర్ధన్ అదే గ్రామానికి చెందిన కండ్లే మదన్ కుమార్ ఇంటికి వడ్రంగి పని ఒప్పందం ప్రకారం ముగించుకొని వెళ్ళిపోయాడు. తర్వాత ఇంకొక పని ఉన్నదని ఇబ్బంది పెట్టగా తనకు ఇప్పుడు పని ఉన్నదని, ఇప్పుడు చేయలేను అని వడ్రంగి చెప్పాడు. కండ్లే మదన్ (ఎస్సీ మాల వృత్తి అడ్వకేట్) విష్ణును విపరీతంగా కులాన్ని దూషిస్తూ విశ్వకర్మలను కించపరిచే విధంగా, కుటుంబాన్ని దుర్భాషలాడుతూ విష్ణుపై అనుచిత వ్యాఖ్యలు చేసి చెయ్యి చేసుకున్నాడు. తదనంతరం బుగ్గారం మండలం అధ్యక్షుడు ఏలేశ్వరం సత్తయ్య, ఉపాధ్యక్షులు వనతడుపుల చారి, గోపులాపూర్ గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులు మండల కుల బాంధవులు అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా సంఘం అధ్యక్షులు చింతల రాజేశ్వర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో కండ్లే మదన్‌పై ఫిర్యాదు చేశారు. శుక్రవారం నిందితుడిని పట్టుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. విశ్వకర్మలకు న్యాయం చేసిన బుగ్గారం ఎస్సై శశిధర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చింతల రాజేశ్వర్, బుగ్గారం మండలం అధ్యక్షులు ఏలేశ్వరం సత్తయ్య, గొల్లపల్లి మండల్ అధ్యక్షులు బలబత్తుల కిషన్, ఉపాధ్యక్షులు ప్రధాన అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు కుల బాంధవులు ఉన్నారు.

# మానవత్వం చాటిన యూత్ సభ్యులు



మల్యాల, మార్చి 21 (మన బలగం): మల్యాల మండల కేంద్రానికి చెందిన సట్టా లతకు చెందిన ఇల్లు ఇటీవల షర్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. లత భర్త అంజయ్య మూడు సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఉన్న ఇల్లు కాలిపోవడంతో కుటుంబం రోడ్డన పడింది. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న బోయవాడ యూత్ సభ్యులు మానవత్వం చాటారు. రూ.5 వేల ఆర్థిక సాయాన్ని లతకు అందజేశారు.

# అవినీతిని ప్రశ్నించినందుకు దాడులా?

మొదటి పేజీ తరువాయి

వారు మాట్లాడుతూ నిన్న గుండారంలోని తన ఇంటిపై కవ్వంపెల్లి సత్యనారాయణ తన అనుచరులతో తనపై దాడి, ఇల్లు ముట్టడి కార్యక్రమం పెట్టుకున్నాడని, ప్రజపాలనలో ప్రశ్నిస్తే దాడులా చేస్తారా అని ప్రశ్నించారు. తనపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా తాను నిరంతరం ప్రజల గొంతుకైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. తాను ప్రజల తరఫున ప్రశ్నిస్తే కాంగ్రెస్ గూండాలతో తనను చంపించే కుట్ర చేస్తోందని ఆరోపించారు. మానకొండూర్ నియోజకవర్గ ప్రజలే వాళ్ళ తరుపున ప్రశ్నించే ప్రతినిధిగా తనకు అవకాశం కల్పించారని అన్నారు. కాంగ్రెస్ పప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీల మీద, అబద్ధపు 420 హామీల మీద ప్రశ్నించిన నాయకుల మీద ప్రతీ పోలీసు స్టేషన్ లో కేసులు, వేధింపులు చేయడం చాలా బాధాకరమన్నారు. 15నెలల నుంచి గన్నేరువరం డబుల్ రోడ్డు పనులు ఎందుకు పూర్తవ్వట్లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో మొత్తం అబద్ధాలు చెప్పినవని మానకొండూర్ నియోజకవర్గంలో తాను అభివృద్ధి చేయలేదు అని చెప్తున్నావు కదా నేను చేసిన అభివృద్ధి ఆనవాళ్లు ఏ గ్రామానికి వెళ్లినా ఉంటాయని అన్నారు. తన హయాంలో అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్ట్, మిడ్ మానేరు, రంగనాయక సాగర్, తోటపెల్లి ఆన్ లైన్ రిజర్వాయర్, 25సబ్ స్టేషన్లు, డబల్ రోడ్లు, సీసీ రోడ్లు, డబల్ బెడ్రూమ్ లు, మహిళా సంఘ భవనాలు, అంబేద్కర్ సంఘ భవనాలు, బ్రిడ్జిలు, అన్ని కుల సంఘ భవనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు నిర్మించామని తెలిపారు. చివరికి నువ్వు ఉంటున్న ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ తాము కట్టిందే అని గుర్తుంచుకోవాలన్నారు. మీరు ఈ పద్ధతి ఇలాగే కొనసాగిస్తే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగపూర్ కాల్వ పనుల కోసం 3.19కోట్లతో బీఆర్ఎస్ హయాంలోనే అంచనా వేసి సాంక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. అక్కడ కొంత భూమి ఫారెస్ట్ ల్యాండ్ కింద ఉంటే దాన్ని తీసివేయడం జరిగిందని అన్నారు. ఇద్దరు రైతులకు ల్యాండ్ అక్విషన్ లో డబ్బులు ఆగిపోయాయని, అలాగే కొంతమంది రైతులకు చెట్ల కోసం డబ్బులు రావాల్సి ఉంటే అప్పటి ప్రభుత్వం దృష్టికి గౌరవ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయినాయని అన్నారు. అప్పటి మేము చేసిన పనులవల్లనే నేడు బతుకమ్మ చెరువులోకి నీళ్లు వచ్చి మత్తడి దూకుతుందని అన్నారు. అనంతరం మానకొండూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూల వేసి కవ్వంపెల్లి సత్యనారాయణకు మంచి బుద్ధి ప్రసాదించాలని వినతిపత్రం అందజేశారు.

# పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన నిర్మల్ కలెక్టర్



నిర్మల్, మార్చి 21 (మన బలగం): పదో తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. శుక్రవారం నుంచి ప్రారంభం అయిన పదవ తరగతి బోర్డు పరీక్షలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని రవి హైస్కూల్, సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలోని పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా? లేదా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏ.ఎన్.ఎం, సిబ్బంది, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావ్, అధికారులు పరమేశ్వర్, తహసీల్దార్లు మల్లేష్, రాజు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

### ప్రభుత్వాలు క్రీడాకారులను ప్రోత్సహించాలి
### డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్




రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 21 (మన బలగం): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోక్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ అన్నారు. భగత్ సింగ్ స్మారక విద్యార్థి, యువజనోత్సవాల సందర్భంగా డీవైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒకవైపు విద్యార్థి యువజనుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు, పోరాటాలు చేస్తూనే మరోవైపు విద్యార్థి, యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఈ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలు చేయడంలో కూడా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ముందుంటుందన్నారు. ప్రభుత్వాలు క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా అనేకమంది విద్యార్థులు, యువత గంజాయికి డ్రగ్స్‌కు బానిసలుగా మారి బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకొని ఉన్నత చదువులకు ఉద్యోగాలకు దూరమై కుటుంబాలకు భారమవుతున్నారని అన్నారు. యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ అక్రమ వినియోగానికి అడ్డుకట్ట వేయాలని అన్నారు.

# స్త్రీ నిధి లోన్స్ రికవరీని పరిశీలించిన డీఆర్డీవో

ఇబ్రహీంపట్నం, మార్చి 21 (మన బలగం): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శుక్రవారం మహిళా స్వశక్తి సంఘాలకు సంబంధించిన స్త్రీ నిధి లోన్స్‌లో రికవరీ నిమిత్తం జరుగుతున్న కార్యక్రమాన్ని జగిత్యాల డీఆర్డీవో రఘువరన్ పరిశీలించారు. రికవరీ వివరాలు తెలుసుకుని సభ్యులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శంకర్, మహిళా సంఘాల నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.